మాటిచ్చి.. ఏమార్చి

'తల్లికి వందనం' అమలులో బాబు రివర్స్ గేర్
- ఎన్నికలకు ముందు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ
- ఇప్పుడు ఎంత మంది ఉన్నా ఒకరికే వర్తింపు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది. ఉచిత ఇసుక విధానం వివాదాస్పదం అయిన నేపథ్యంలో కొత్తగా తల్లికి వందనం పథకం కూడా వివాదాల నడుమ అమలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'అమ్మఒడి' పథకాన్ని తల్లికి వందనంగా మార్చి ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ రూ.15 వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదరగొట్టారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మెలిక పెట్టారు. తాజాగా విడుదల చేసిన జీఓలో తెల్లకార్డు కలిగిన కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఒక్కరికే ఏడాదికి రూ.15 వేలు మాత్రమే అందజేస్తామని ప్రకటించడంతో తల్లుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



సూపర్‌సిక్స్ మేనిఫెస్టో లోగో

ఇచ్చిన హామీని అమలు చేయాలి



నా ఇద్దరు పిల్లలను చదివిస్తున్నా. గతేడాది వరకు అమ్మఒడి పథకం కింద గత ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని సమయానికి అందించేది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో చదువు ఖరీదైపోయింది. దీంతో ప్రైవేట్ స్కూల్లో చదివించాలంటే ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందిని చదివిస్తే ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. దీని ప్రకారం సంవత్సరానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. లేకుంటే ఇబ్బంది పడాల్సిందే.

– బుజ్జమ్మ, మైపాడురోడ్డు, నెల్లూరు నగరం

మోసం చేయడం తగదు



నా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. చంద్రబాబు తాను ముఖ్యమంత్రి అయితే ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంత మందికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామన్నారు. దీంతో దిగువ మధ్య తరగతికి చెందిన మా కుటుంబం సంతోషించింది. అయితే ఎన్నికల్లో గెలిచి సీఎం పదవి చేపట్టాక మాటమార్చి ఒక్కరికే తల్లికి వందనం ఇస్తామని చెప్పటం అన్యాయం. ఇలా మోసం చేయడం తగదు. ఇచ్చిన మాట నిలుపుకుని ఇప్పటికైనా చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.

– ఎస్కే బీబీజాన్, బుజబుజ నెల్లూరు

నిరాశ కలిగించింది



నాకు ఇద్దరు సంతానం. కూతురు, కుమారుడు చదువుకుంటున్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ఇద్దరికీ తల్లికి వందనం కింద రూ.30 వేలు వస్తుందని ఆశించా. అయితే ఒక్కరికే వస్తుందని చెప్పడం నిరాశ కలిగించింది.

– స్వాతి, వేదాయపాళెం, నెల్లూరు

విడ్డూరంగా ఉంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ సంవత్సరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇంట్లో ఒకరికే ఈ పథకం వర్తిస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉంది. నా ఇద్దరు పిల్లలకు పథకం వర్తిస్తే ఆర్థిక భరోసాగా నిలుస్తుందని భావించా.

– మౌనిక, నవాబుపేట

రూ.45 వేలు వస్తుందని ఆశపడ్డా



నా కుమార్తెకు ముగ్గురు మగ సంతానం. ముగ్గురు మనువళ్లు చదువుకుంటున్నారు. ఈ ఏడాది జూన్ నెలలో రావాల్సిన అమ్మఒడి ఇంకా రాలేదు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రూ.15 వేలు చొప్పున రూ.45 వేలు వస్తుందని ఆశపడ్డా. అయితే ఇంట్లో ఒక్కరికే పథకం వస్తుందని చెబుతున్నారు. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు.

– జ్యోతి, దర్గామిట్ట

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముగ్గురికీ తల్లికి వందనం కింద రూ.45 వేలు వస్తాయని చంద్రబాబునాయుడికి ఓటు వేశాం. అయితే ఒక్కరికే వస్తుందని ప్రకటించడం బాధ కలిగించింది. ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

– సుశీల, శ్రామికనగర్, నెల్లూరు

క్లుప్తంగా

రైతు బజార్‌లో సరుకుల పంపిణీ నేడు

పొదలకూరు : పట్టణంలోని రైతుబజారులో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు అందజేస్తారు. ఈ కార్యక్రమాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు వెల్లడించారు. ముందుగా బియ్యం, కందిపప్పు తదితర సరుకులను అందజేస్తారన్నారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శ్రీశిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకి సేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

డైట్ కళాశాలలో సెమినార్



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జనాభా నియంత్రణపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

కొడవలూరు : బహుళ ప్రయోజనాలున్న బీసీజీ వ్యాక్సిన్‌పై కార్మికుల్లో అవగాహన అవసరమని హెల్త్ అసిస్టెంట్ వెంకట్రావు సూచించారు. మండలంలోని రాచర్లపాడు గమేసా ఫ్యాక్టరీలో కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్ ఉపయోగాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవచ్చన్నారు. దీనివల్ల క్షయ వ్యాధి రాకుండా ఉండడంతో పాటు బీపీ, షుగర్‌లను నియంత్రించవచ్చన్నారు. అయితే దీనిని ప్రస్తుతం క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు వేయించుకోకూడదన్నారు. ధూమపానం అలవాటు ఉన్న వారు, షుగర్‌తో బాధపడుతున్న వారు, క్షయ బాధితులతో దగ్గరి సంబంధాలున్న వారు విధిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ పర్యవేక్షకులు సత్యనారాయణ, నవీన్, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అనికేపల్లిలో ఉచిత వైద్యశిబిరం



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

వెంకటాచలం : మండలంలోని అనికేపల్లి గ్రామంలో నారాయణ హాస్పిటల్ సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, చెమికల కిష్టయ్య, మందల మణి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి వాసికి జాతీయస్థాయి పురస్కారం



సర్టిఫికెట్ అందుకుంటున్న వెంకటసురేష్

నెల్లూరు(బృందావనం) : సింహపురికి చెందిన సాక్సోఫోన్ విద్వాంసుడు జువ్వలదిన్నె వెంకట సురేష్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంగీత వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట మాల్యాద్రి, గువ్వాడి ధనుంజయ, కార్యదర్శి పండ్లూరు వాసు, కోశాధికారి వీరేపల్లి కిశోర్ గురువారం నెల్లూరులో వివరాలు వెల్లడించారు. సెంట్రల్ ఆడిషన్ బోర్డు వారు నిర్వహించిన జాతీయ స్థాయి సాక్సోఫోన్ వాయిద్యంలో వెంకట సురేష్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌ను సాధించారన్నారు. దీనిని విజయవాడ ఆలిండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాన్‌గా, ఆంధ్ర రత్నంగా, స్టేట్ బెస్ట్ సిటిజన్ అవార్డులతో పాటు ఎన్నో పురస్కారాలను సురేష్ అందుకున్నారని వివరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను గురువారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెహ్రూయువ కేంద్రం, డీకేడబ్ల్యూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రపంచ జనాభా పెరుగుదలపై ప్రభావం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్రం కోఆర్డినేటర్ మహేంద్ర రెడ్డి, ఆర్ఐఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, సెట్నెల్ సూపరింటెండెంట్ గయాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు



మహిళకు కందిపప్పు అందజేస్తున్న డీఎస్ఓ

- డీఎస్ఓ వెంకటరమణ

నెల్లూరు(పొగతోట) : నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేలా చర్యలు చేపట్టామని, రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని డీఎస్ఓ వెంకటరమణ అన్నారు. నగరంలోని నవాబుపేట రైతు బజారులో పౌరసరఫరాల శాఖ ఆదేశాలతో జిల్లా రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని నెల్లూరు ఆర్డీఓ మలోలాతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న రైతు బజారుల్లో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పచ్చి బియ్యం కేజీ రూ.48, స్టీమ్ (బీపీటీ) కేజీ రూ.49లకు, కేజీ కందిపప్పు రూ.160లకు విక్రయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, రంగయ్యనాయుడు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మంచికంటి శ్రీనివాసులు, శ్రీరామ్‌సురేష్, సీఎస్‌డీటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

'పెరసం' 15వ వార్షికోత్సవం రేపు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరం ప్రాంగణంలో ఉన్న వర్ధమాన సమాజం రీడింగ్ రూమ్‌లో ఈనెల 13వ తేదీన 'పెన్నా రచయితల సంఘం'(పెరసం) 15వ వార్షికోత్సవం, పెన్నా సాహిత్య పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందని ఆ సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం భక్తవత్సలనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమేపల్లి కవితా సంపుటి 'ఆకురాలిన చప్పుడు'కు పెన్నా సాహిత్య పురస్కారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెరసం కార్యదర్శి తోట సులోచన, గౌరవాధ్యక్షుడు అవ్వారు శ్రీధర్ బాబు, ఉపాధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, కోశాధికారి అన్నం శివకృష్ణ పాల్గొన్నారు.

రూ.లక్ష రుణం మంజూరు



చెక్కును అందుకుంటున్న సురేష్ ఆచారి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద రూ.లక్ష రుణం మంజూరు కావడం ఆనందంగా ఉందని విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖజాన వెంకటశేషయ్య ఆచారి అన్నారు. జిల్లాలో మెదటిసారిగా రుణానికి అర్హత సాధించిన పెనుబర్తి సురేష్ ఆచారికి సంగం గ్రామ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ మధుసూదనరావు చేతుల మీదుగా గురువారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ రుణాల మంజూరుతో చేతి వృత్తిదారుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో బాబు ఆచారి, రఘునాథ్, రఘురామయ్య, వరప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న నగర డీఎస్పీ శ్రీనివాసులు

కోవూరు : రెండు రోజుల క్రితం కోవూరు రాళ్లమిట్ట ప్రాంతంలో జరిగిన హత్య కేసులో నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులు కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం గాంధీ జనసంఘం ప్రాంతానికి చెందిన నాగరాజు పందులను పట్టడానికి కోవూరు జంగం వీధికి వచ్చారు. అక్కడ జరిగిన ఘర్షణలో గాంధీ జన సంఘం ప్రాంతానికి చెందిన దుర్గయ్య, కోటేశ్వరరావులు కలిసి నాగరాజును హత్య చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలించి నిందితులను పట్టుకున్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి

- డిప్యూటీ డీఈఓ రఘురామయ్య



హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ రఘురామయ్య

కొడవలూరు : విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ పి.రఘురామయ్య తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న బోధన పద్ధతులు, విద్యార్థుల సంఖ్య, సామర్థ్యాలు, వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యాశాఖ నిర్దేశించిన కార్యక్రమాల అమలును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. విద్యాశాఖ కేటాయించిన కార్యక్రమాలను తప్పకుండా అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచవచ్చన్నారు. పాఠశాల విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా చూసుకోవడంతో పాటు బడి బయట చిన్నారులను గుర్తించి పాఠశాలలో చేర్చాలన్నారు. విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం సమైక్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.అంకయ్య, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రామ్‌కుమార్, వై.కొండారెడ్డి, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నివారణ

- వైద్యాధికారి ఎం.రామకృష్ణ



కొడవలూరులో గంబూసియా చేప పిల్లలను వదులుతున్న వైద్య బృందం

కొడవలూరు : గంబూసియా చేపలను మురుగు కాలువలు, గుంతల్లో వదలడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ప్రాంగణంలోని మురుగు నీటి కాలువ, తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న నీటి గుంత, మూలకట్ల గిరిజన కాలనీలోని మురుగు నీటి కాలువల్లో గంబూసియా చేప పిల్లలను గురువారం వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమలను ఉత్పత్తి చేసే లార్వాను గంబూసియా చేపలు ఆహారంగా తీసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చన్నారు. కొడవలూరులోని మురుగు నీటి కాలువల్లో గంబూసియా చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, స్టాఫ్ నర్స్ వెన్నెల, ల్యాబ్ టెక్నీషియన్ మెర్సీ, ఫార్మాసిస్ట్ సరస్వతి పాల్గొన్నారు.

గర్భిణులకు పక్కాగా వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ, చిత్రంలో ఇతర వైద్యాధికారులు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్) : జిల్లాలోని ప్రతి గర్భిణికి క్రమం తప్పకుండా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు రక్త, స్కానింగ్ పరీక్షలు చేయిస్తూ వారి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య సూచించారు. సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మాతృ మరణాలపై సబ్‌కమిటీ సమీక్ష సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో గత మే నెలలో మూడు మాతృమరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ఇందుకు కారణాలు తెలపాలని సంబంధిత పీహెచ్‌సీల డాక్టర్లను కోరారు. గర్భం దాల్చిన మహిళ పేరును రిజిస్టర్ చేసినప్పటి నుంచే ఏఎన్ఎం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రక్తహీనత, బీపీ వల్లనే సమస్యలు వస్తున్నాయన్నారు. రక్తహీనత కలుగకుండా వారు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి, కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత, డాక్టర్ ప్రియంవద, సంబంధిత వైద్యులు, డెమో అధికారి శ్రీనివాసరావు, డీపీహెచ్ఎన్ఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి



ఆందోళన చేస్తున్న ఐద్వా సభ్యులు

నెల్లూరు(బారకాసు) : మహిళా మార్ట్ ఏర్పాటులో జరిగిన అవినీతిపై సమగ్రంగా విచారణ జరపాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు డిమాండ్ చేశారు. పొదుపు మహిళల నుంచి వసూలు చేసిన నగదును తిరిగి వారికి చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఐద్వా నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో డైకస్ రోడ్డు సెంటర్ నుంచి శాంతినగర్‌లోని మహిళా మార్ట్ వరకు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో వరలక్ష్మి రమమ్మ, షాజహాన్, జాకీరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

వందలాది చెట్ల తొలగింపు



పెద్దాస్పత్రి ఆవరణలో తొలగించిన క్రోనోకార్పస్ చెట్లు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సుమారు ఆరేడు ఏళ్లుగా పెంచిన క్రోనోకార్పస్ చెట్లను గురువారం వైద్యశాఖాధికారులు నరికివేయించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, వసతి గృహాలు, ఆస్పత్రి, మార్చురీ భవనం తదితర ప్రాంతాల్లో వందలాది క్రోనోకార్పస్ చెట్లు ఉన్నాయి. ఇవి చాలా ఏపుగా పెరిగిపోయాయి. పక్షులు కూడా వాలని ఈ చెట్ల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. అందువల్ల వాటిని తొలగించాలని గత రెండేళ్లుగా పలువురు ఉద్యమిస్తున్నా అధికారుల్లో చలనం రాలేదు. ఎట్టకేలకు వీటిని తొలగించారు. ఈ సందర్భంగా పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ మాట్లాడుతూ తొలగించిన క్రోనో కార్పస్ చెట్ల స్థానంలో హార్టికల్చర్ అధికారుల సహకారంతో పర్యావరణానికి మేలు చేసే మొక్కలను పెంచుతామన్నారు.